క్లుప్తంగా

బీవైఎఫ్ టీంకు క్రికెట్ కిట్ పంపిణీ



క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న రాజు

ఇబ్రహీంపట్నం: బండలేమూర్ గ్రామానికి చెందిన బీవైఎఫ్ టీం (బంటీ యూత్ ఫోర్స్)కు ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు జెర్కొని రాజు క్రికెట్ కిట్‌ను శుక్రవారం అందజేశారు. శారీరక ధారుఢ్యంతోపాటు స్నేహసౌభ్రాతృత్వాలను పెంపొందించే క్రీడల పట్ల యువత ఆసక్తిని కనబరచాలని, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా గ్రామీణ యువత ఎదగాలని ఈ సందర్భంగా రాజు ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఎలాంటి సాయం కావాలన్నా కోరాలన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్ కుమార్, నియోజకవర్గ కార్యదర్శి వీరేశ్, విజయ్, శివప్రసాద్, శ్రవణ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ పావనికి సన్మానం



పావని దంపతులను సన్మానిస్తున్న రజకసంఘం నాయకులు

మంచాల: ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన మంచాల గ్రామానికి చెందిన మొగిలి పావని వెంకటేష్ దంపతులను శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రజకులకు తగిన ప్రాధాన్యత కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పావని భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, మండల అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి మొగిలి శ్రీశైలం, నాయకులు.. బాలయ్య, బాలరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి

జెడ్పీటీసీ వెంకటేశ్

మాడ్గుల: మండలంలోని నాగిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్ బోరు వేయించారు. ఇటీవల నాగిళ్ల పాఠశాలలో విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీకి వచ్చిన ఉప్పల వెంకటేశ్‌కు పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను విద్యార్థులు విన్నవించారు. స్పందించిన వెంకటేశ్ బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు పాఠశాలలో బోరు వేయించి నీటి వసతిని కల్పించారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషిచేస్తానని వెంకటేశ్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉప్పల వెంకటేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

యాదాద్రికి తరలిన డీఎస్సీ అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం: శ్రీలక్ష్మీనరసింహస్వామికి మొక్కులు–సీఎం కేసీఆర్‌కు వేడుకోలు అనే నినాదంతో యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి చెంత చేపట్టిన కార్యక్రమానికి శుక్రవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి 2008 డీఎస్సీ బీఈడీ మెరిట్ అభ్యర్థులు తరలివెళ్లారు. అసోసియేషన్ జిల్లా నాయకుడు దార జంగయ్య, రాజు, రవి మాట్లాడుతూ.. 2008 డీఎస్సీకి సంబంధించి హైకోర్టు తీర్పును కేసీఆర్ అమలు పరిచేవిధంగా కరుణించాలని, ఆ శ్రీ లక్ష్మీనృసింహస్వామికి మొక్కేందుకు వెళ్లినట్లు తెలిపారు. న్యాయస్థానం తీర్పును గౌరవించి తమకు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు తమకిచ్చిన హామీని అమలు పరిచి తమ జీవితాల్లో వెలుగునింపాలని వారు కోరారు. ఇక్కడి నుంచి తరలివెళ్లిన వారిలో దయానంద్, మహేందర్, ఆనంద్, శ్రీహరి, బుగ్గరాములు, అనిత, విజయలక్ష్మీ, అనురాధ, స్రవంతి, ప్రేమలత, సూర్య ఉన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం

రైతుసంఘం నేత ముసలయ్య

ఇబ్రహీంపట్నం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని రైతు సంఘం మండల కార్యదర్శి ముసలయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో శుక్రవారం రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ముసలయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాల నిర్ణయాల వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఆదివారం నగరంలోని ఇందిరా పార్కు వద్ద జరిగే రైతు సంఘం రాష్ట్ర సెమినార్‌కు అన్ని గ్రామాల నుంచి రైతు ప్రతినిధులు హాజరుకావాలని.. జనవరిలో సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్, అశోక్, భిక్షపతి, యాదయ్య, శ్రీను, మల్లేశ్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్లకు రూ.966.50లక్షల మంజూరు
- బీటీ రోడ్ల మరమ్మతులకు మరో రూ.595 లక్షలు
- తీరనున్న వాహనదారుల ఇబ్బందులు



ఆగాపల్లి- మంచాల రోడ్డుపై గుంతలు

మంచాల: గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక రాకపోకలకు ఇబ్బందిగా మారిన రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే ప్రభుత్వం రోడ్ల మరమ్మతుల నిమిత్తం లక్షలాది రూపాయల నిధులు మంజూరు చేసింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 80శాతం మేర రోడ్లు మరమ్మతులు, అవసరమైన చోట నూతన రోడ్లు ఏర్పాటు కానున్నాయి. నియోజక వర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో వర్షాల కారణంగా పాడైపోయిన తొమ్మిది గ్రామాలకు సంబంధించిన 39.40 కిలో మీటర్ల రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.966.50 లక్షలు మంజూరు చేసింది. అందులో ప్రధానంగా మంచాల మండలంలోని ఆగాపల్లి నుంచి మంచాల(వయా జాపాల) రోడ్డు (10 కిలోమీటర్లు)మరమ్మతు కోసం రూ.215 లక్షలు. యాచారం మండలంలోని నాగార్జున సాగర్–హైదరాబాద్ రోడ్డు నుంచి తులేకుర్దు (వయా చౌదరిపల్లి) రోడ్డు (7.5 కిలో మీటర్లు) మరమ్మతుల కోసం రూ.166 లక్షలు మంజూరు చేయగా, ఇబ్రహీం పట్నం మండలంలోని నాగార్జున సాగర్ రోడ్డు నుంచి పోచారం (వయా ఉప్పరిగూడ)రోడ్డు (5.50 కిలోమీటర్లు) రూ.185 లక్షలు మంజూరు చేసింది. ఇలా నియోజకవర్గంలో 9 గ్రామాలకు సంబంధించిన రూ.966.50లక్షలు మంజూరు అయ్యాయి.

బీటీ రోడ్ల నిర్మాణం..

అదే విధంగా పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి నియోజకవర్గంలో పాడైపోయిన బీటీ రోడ్ల నిర్మాణంలో భాగంగా 7 గ్రామాలకు సంబంధించిన 16.70 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.595 లక్షలు మంజూరు చేసింది. ఇందులో ప్రధానంగా మంచాల మండలంలోని మంచాల నుంచి తిప్పాయిగూడ (వయా చిత్తాపూర్) రోడ్డు (4.10కిలోమీటర్లు)కు రూ.120 లక్షలు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కుత్బుల్లాపూర్–గౌరెల్లి రోడ్డు (5.40 కిలో మీటర్లు)కు రూ.187.50 లక్షలు ఇలా ఏడు గ్రామాలకు సంబంధించి 16.70 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం రూ.595లక్షలు మంజూరయ్యాయి. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే వాహనాల రాకపోకలకు ఏలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం ఈరోడ్లు పాడైపోయిన చోట్ల గోతులు ఏర్పడి రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారాయి. రాత్రిపూట వాహనదారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. రోడ్ల బాగు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతోనే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మారుమూల గ్రామాలకు కూడా బీటి రోడ్డు వేయాలనే ప్రభుత్వ సంకల్పం చాలా గొప్పది. మా గ్రామ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకావడం చాలా సంతోషం. త్వరగా రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

– వీరేష్ గౌడ్, తిప్పాయి గూడ

త్వరలో పనులు ప్రారంభిస్తాం



నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు రోడ్ల నిర్మాణం కోసం పెద్దఎత్తున నిధులు మంజూరయ్యాయి. వాటి నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభిస్తాం. ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరిస్తాం. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి.

– అబ్బాస్, డీఈఈ, పంచాయతీ రాజ్ శాఖ

రైతుల చెంతన మార్కెట్ సేవలు



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డితో మార్కెట్ కమిటీ పాలకవర్గం

మార్కెట్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిశారు. కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్పుల చంద్రయ్యతోపాటు సభ్యులు.. ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు మార్కెటింగ్ సేవలు మరింత చేరువ చేసేందుకు పాలకవర్గం కృషిచేయాలని సూచించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చేందుకు మార్కెట్ పాలకవర్గం శాయశక్తులా కృషి చేయాలన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ..

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూటీఎస్) క్యాలెండర్, డైరీని శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే గడ్డి విత్తనాల పంపిణీ

వెటర్నరీ అసిస్టెంట్ శేఖర్

మాడ్గుల: ఈనెల 5న 'సాక్షి' దినపత్రికలో 'గడ్డి విత్తనాలు పక్కదారి' అనే శీర్షికన వచ్చిన వార్తకు వెటర్నరీ అసిస్టెంట్ గ్యార శేఖర్ స్పందించారు. ఈ విషయమై ఆయన శుక్రవారం రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. రైతుల పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులు తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం గడ్డి విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి తనను మందలించలేదని వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చానని పేర్కొన్నారు. తాను ఆన్‌డ్యూటీలో ఉన్నందున ప్రజాప్రతినిధులకు, పత్రికలకు సమాచారం ఇవ్వలేక పోయానని శేఖర్ వివరించారు.

సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచండి: ఎంపీడీఓ

మాడ్గుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాఘవులు అన్నారు. మండలంలోని ఇరిన్, కలకొండ, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ రాఘవులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనాన్ని రుచి చూశారు. మూత్రశాలల నిర్వాహణ గురించి వాకబు చేశారు. ఆయన వెంట సీడీపీఓ సక్కుబాయి, ఏపీఓ నర్సింగ్, సూపర్వైజర్ జయమ్మ, టీఏలు, కార్యదర్శులు ఉన్నారు.

మంగమ్మది ప్రభుత్వ హత్యే

వైఎస్సార్‌టీపీ నేత అర్జున్‌రెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన మంగమ్మ హైదరాబాద్‌లోని కోఠి ఆస్పత్రిలో ప్రసవం అనంతరం గురువారం మృతిచెందింది. శుక్రవారం వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి చుక్కాపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంగమ్మ మృతదేహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మంగమ్మ మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మాటికి ఇది ప్రభుత్వ హత్యనేనని.. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

దానగుణం కలిగి ఉండాలి

లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రతి ఒక్కరు దానగుణం కలిగి ఉండాలని లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం జంబుల రంగారెడ్డి వర్ధంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చెన్నకిషన్‌రెడ్డి ప్రారంభించారు. చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ వీల్స్ ఆన్‌మీల్స్ అనే కార్యక్రమం ద్వారా అన్నదానం నిర్వహిస్తుందని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరు దానగుణం అలవరచుకోవాలని ఆయన సూచించారు. మానవసేవే మాధవసేవ అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ అంజయ్య, సభ్యులు రమేశ్, మహేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఎంగలి బాలకృష్ణ, చంద్రశేఖర్, యాదయ్య, కండె ఓంకారం, పాషా, వీరబొమ్మ రామ్మోహన్, ఏలె శివకుమార్, లయన్స్‌క్లబ్ సభ్యురాలు సుధ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: క్రీడలతో శారీరక వ్యాయమంతో పాటు, స్నేహభావం పెంపొందుతుందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల్ మండలం బాలాజీనగర్ పంచాయతీ పరిధిలోని రేకులకుంట తండాలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమ్లీబీచ్యానాయక్, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, నాయకులు శ్రీశైలం, శ్రీను, పవన్‌కుమార్, అమర్‌సింగ్, హనుమస్వామి పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ వీఎస్ఆర్ ఇంజనీరింగ్ వర్క్స్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో కోరిన లక్ష్యాలు నేరవేరి, అనుకున్న విజయాలు సాధించాలని వీఎస్ఆర్ ప్రొప్రయిటర్ వానరాసి వెంకటేశు మరింత ఉన్నతికి ఎదగాలని శ్రీనివాస్‌యాదవ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకటేశ్, కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో అధిక లాభాలు

వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి

కడ్తాల్: సాగులో పచ్చిరొట్ట ఎరువులు, భాస్వరం కరిగించు జీవన ఎరువుల వాడకంతో తక్కువ పెట్టుబడితో పాటు అధిక లాభాలను ఆర్జించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద క్లస్టర్ పరిధిలోని రైతులకు.. పచ్చిరొట్ట ఎరువు, భాస్వరంను కరిగించు జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. సాగులో రైతులు తప్పకుండా పచ్చిరొట్ట ఎరువులు, జనుము చల్లి.. పూత దశలో దున్నినట్లయితే వరిలో నత్రజని (యూరియా) వాడాకాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. భాస్వరం కరిగించే బ్యాక్టీరియా ద్వారా భూమిలో ఉన్న భాస్వరం మొక్కలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తద్వార వరి పంటకు డీఏపీపై అదనపు ఖర్చులు తగ్గించుకోవచ్చని భాస్వరం మెరుగుపడుతుందన్నారు. జీవ నియంత్రణ ఉత్పత్తుల వాడకంతో భూమి మరింత సారవంతమవుతుందని వాయు, జల కాలుష్యాన్ని నివారించుకోవచ్చని తెలిపారు. అదే విధంగా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని వివరించారు. సమావేశానికి హాజరైన క్లస్టర్ పరిధిలోని రైతులు, సాగుకు సంబంధించి వివిధ సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి, సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సేవ్యానాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, రైతు బంధు గ్రామ కోర్డినేటర్ నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, రైతులు భిక్షపతి, వెంకటేశ్, జంగారెడ్డి, సత్యం, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ మల్లారెడ్డి

కొత్తగూడ సర్పంచ్ మల్లారెడ్డి

కందుకూరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తగూడలో హైదరాబాద్‌కు చెందిన కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఏప్పటికప్పుడు చికిత్స పొందాలన్నారు. కాగా శిబిరంలో వైద్యులు డాక్టర్ సందీప్, శ్రీజ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్తానిక నాయకులు బాలేష్‌ముదిరాజ్, కృష్ణ, ఇస్తారి, కారోబార్ సర్వేష్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు

ఇబ్రహీంపట్నం: స్కీం వర్కర్లందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న డిమాండ్ చేశారు. దేశవ్యాప్త స్కీమ్ వర్కర్ల నిరసన కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నభోజనం, ఐకేపీ, వీఓఏలు, సర్వశిక్ష అభియాన్‌తో పాటు72 రకాల స్కీముల్లో దేశవ్యాప్తంగా కోటిమంది స్కీం వర్కర్లుగా పనిచేస్తారని తెలిపారు. రాష్ట్రంలో 3.5 లక్షల మంది స్కీం వర్కర్లు 40 సంవత్సరాలుగా ఆయా స్కీమ్ లో పనిచేస్తున్నారని చెప్పారు. అత్యంత కీలక పథకాల్లో పనిచేస్తున్న వీరికి ఎలాంటి చట్టబద్ద సౌకర్యాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు స్కీం వర్కర్లకు పనిభారాన్ని పెంచుతున్నా ఇందుకు అనుగుణంగా వేతనాలు పెంచడంలేదన్నారు. రూ.26 వేలు కనీస వేతనం చెల్లించి.. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించి, ఒకే రకమైన సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కన్వీనర్ బుగ్గరాములు, ఎల్లేశ్, యాదగిరి, బాలమణి, పెంటమ్మ, పద్మ, యాదమ్మ, అండాలు ప్రేమలత, హంసమ్మ, శారదమ్మ పాల్గొన్నారు.

మంచాలలో...

మంచాల: స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మంచాలలో నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేకుండా వెట్టిచాకిరీ చేయించుకోవడం దారుణమన్నారు. తమ డిమాండ్లను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, స్కీం వర్కర్లు వైదేహి, వరలక్ష్మి, అమృత, సంతోష, నవనీత, జ్యోతి, విజయలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ అనురాధ

కలెక్టర్‌కు జెడ్పీటీసీ అనురాధ వినతి

ఆమనగల్లు: గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్‌సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి ఆమనగల్లు పట్టణంలో స్థలం కేటాయించాలని ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అమయ్‌కుమార్‌కు జెడ్పీటీసీ అనురాధ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఆమనగల్లు ప్రాంతంలో గిరిజనుల జనాభా అధికంగా ఉందని అందువల్ల గిరిజనుల దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణం కోసం పట్టణంలోని సర్వే నం 730, 732లో ఉన్న ప్రభుత్వ స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆమె వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, నాయకులు వెంకటేశ్, గణేశ్, రమేశ్ తదిరతులు పాల్గొనారు.

ఇబ్రహీంపట్నంలో చిరుజల్లులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం పూట పొగమంచుతో పాటు చిరుజల్లులు కురిసాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. చిరుజల్లులు ఉదయం 11 గంటల వరకు కురిసాయి. దీంతో రోడ్లపై జనసంచారం తగ్గింది. వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడ్డారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



ఇబ్రహీంపట్నం: బాధితులకు ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని కోనాపూర్ గేటు తండాకు చెందిన మేగావత్ నీలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.20వేలు మంజూరయ్యాయి. కోనాపూర్ గేటు తండాలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆ చెక్కును నీల కుటుంబ సభ్యులకు ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోటగిరియాదవ్ అందించారు. నాయకులు చందు, భీమయ్య, నరేందర్, తోట కృష్ణ, విక్రం, అల్లాజీ, సురేశ్, శ్రవన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతండాకు చెందిన మస్రుకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.56 వేలు, మేడిగడ్డతండాకు చెందిన వనితకు రూ.40వేలు, కడ్తాల మండలం పెద్దిరెడ్డి చెరువుతండాకు చెందిన సువాలికి రూ.2లక్షలు, వెల్దండ మండలం పెద్దాపూర్‌కు చెందిన శేఖర్‌కు రూ.60వేలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని శుక్రవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీపీ అనిత విజయ్, నాయకులు జిల్లెల రాములు, దామోదర్, శేఖర్, కృష్ణ, బీష్మాచారి, లక్ష్మయ్య, బిక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీల అందజేత..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన నిట్టు మల్లయ్య, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ గ్రామానికి చెందిన జ్యోష్ణ ఆనారోగ్యంతో నగరంలోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఇరువురికి వైద్య ఖర్చుల కుగాను ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులను ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మంజూరు చేయించారు. ఎల్ఓసీలను బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ నాయకులు బుగ్గరాములు, రవీందర్, సురేష్, అంజయ్య, కౌన్సిలర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల మండలంలో..

మాడ్గుల: మండలంలోని కొర్రతండాకు చెందిన రతన్‌నాయక్‌కు సీఎంఆర్ఎఫ్ పథకంకింద మంజూరైన రూ.ఒక లక్ష చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, ఎంపీటీసీ సభ్యులు వెంకటయ్య, సర్పంచ్ రామేశ్వర్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు రాజుగౌడ్, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.